క్లుప్తంగా

నేటి నుంచి బల్లోల సంబరాలు



పాలపోలమ్మ

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ గ్రామంలో ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజులు పాటు బల్లోల సంబరాలు జరగనున్నాయి. సాంఘిక, పౌరాణిక నాటకాలు, నృత్యాలు నిర్వహించనున్నారు. మూడవరోజు మురాటాలతో పాలపోలమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లింపులతో సంబరాలు ముగుస్తాయి. గ్రామాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

బ్లడ్ అందజేత



బ్లడ్ ప్యాకెట్‌ను అందజేస్తున్న జోగారావు

సోంపేట: మండలంలోని మాకన్నపురం గ్రామానికి చెందిన రోగి సోంపేట సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అత్యవసర చికిత్స కోసం రక్తం అవసరం అయ్యింది. వైఎస్సార్‌సీపీ నాయకుడు, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు స్పందించి బ్లడ్ ప్యాకెట్‌ను రోగి కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు.

వాటర్ ప్యూరిఫైర్ వితరణ



వాటర్ ప్యూరిఫైర్ అందిస్తున్న దాతలు

కంచిలి: మండలంలోని మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నన్న వానప్రస్థాశ్రమంలో గిరిజన విద్యార్థుల వసతి గృహం విద్యార్థుల దాహార్తిని తీర్చడానికి దాతలు ముందుకొచ్చారు. రూ. 26 వేల విలువైన ఆక్వా వాటర్ ప్యూరిఫైర్‌ను నిర్వాహకులకు శనివారం అందజేశారు. దీన్ని సమకూర్చిన దాతల్లో పద్మనాభపురం గ్రామయువత, ప్రాణదాత బ్లడ్ బ్యాంకు మేనేజర్ సాయి మహంత్, మణికంఠ మహాపాత్రో, మంగి శివ క్రిష్ణలు ఉన్నారు. వీరికి ఫౌండేషన్ నిర్వాహకులు ధన్యవాదాలు తెలియజేశారు.

ఎమ్మెల్సీ పరామర్శ



జోగారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రామారావు

సోంపేట: వాడపాలెం గ్రామానికి చెందిన పి.జోగారావు చేపల వేటకు వెళ్లి ఓడ ప్రమాదంలో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు జోగారావు కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. అలాగే ఇటీవల ప్రమాదానికి గురైన గొర్ల అప్పారావు, గౌరకల ఢిల్లీరావులను కూడా ఎమ్మెల్సీ పరామర్శించి ఆరోగ్యవివరాలు అడిగి తెలుసుకున్నారు. వైస్ ఎంపీపీ గురాల శ్రీను, పలాసపురం, బారువ సర్పంచ్‌లు తడక జోగారావు, యర్ర రజని, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజు, పద్మనాభం ఉన్నారు.

విద్యార్థినులకు బహుమతులు ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

సోంపేట: విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని రోటరీ ప్రతినిధులు అన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో సత్తాచాటిన సోంపేట ఎస్సీ బాలికల వసతి గృహానికి చెందిన విద్యార్థినులకు జిల్లా రోటరీ ఇమేజ్ చైర్మన్ దుద్ది శ్రీనివాసరావు, రోటరీ ప్రతినిధి మల్లా తిరుమలరావు ఆదివారం వసతిగృహ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. ఒకొక్కరికీ రూ. మూడు నగదు, పుస్తకాలు, డైరీ, కుర్చీ, గొడుగును అందజేశారు. ప్రతిభ చాటిన విద్యార్థినులకు ఏటా బహుమతులు అందజేస్తామన్నారు. రోటరీ ప్రతినిధులు రవికుమార్, సంతు ఉన్నారు.

అవతార వైభవం

- కొనసాగుతున్న రథయాత్ర ఉత్సవాలు



సోంపేట: శ్రీరామ అవతారంలో జగన్నాథుడు



ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టిలో పరుశురాముని అవతారంలో స్వామివారు



టెక్కలి: రామవతారంలో జగన్నాథస్వామి



ఇచ్ఛాపురం: శ్రీవేంకటేశ్వరస్వామి అవతారంలో జగన్నాథస్వామి

సోంపేట: జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా స్వామివారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇస్తున్నారు. ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. సోంపేటలో జగన్నాథుడు శ్రీరామ అవతారంలో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోంపేట, పరిసర గ్రామాల భక్తులు శ్రీరామ అవతారంలో జగన్నాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పరుశురాముని అవతారంలో..

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి, కీర్తిపురం గ్రామాల్లో వెలసిన జగన్నాథ స్వామి వారు భక్తులకు పరుశురాముడు అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో హాజరైన భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేంకటేశ్వర స్వామిగా..

ఇచ్ఛాపురం: జగన్నాథుని రథయాత్రలో భాగంగా గుడించా మందిరంలో సుభద్ర, బలరామస్వాములతో పాటు కొలువైన జగన్నాథస్వామి వారు వేంకటేశ్వరస్వామి అవతారంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేంకటేశ్వరస్వామిగా జగన్నాథస్వామి, పాండురంగనాథస్వామిగా బలభద్ర స్వామి వారు, శ్రీకృష్ణునిగా చిన్న జగన్నాథస్వామి వారిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

టెక్కలిలో రామవతారంలో..

టెక్కలి: టెక్కలిలో జరుగుతున్న జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారు రామవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవదాయ, ధర్మదాయ శాఖ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పాత జాతీయ రహదారిలోని గుండిచాదేవి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా రామవతారంలో ఉన్న జగన్నాథస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

కొబ్బరి రైతులకు అండగా ఉంటాం



కొబ్బరి మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

కంచిలి: ఉద్దానంలో కొబ్బరి రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున అండగా ఉంటామని స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. పెద్దకొజ్జిరియా గ్రామంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆర్ అండ్ ఆర్ పథకం కింద మంజూరైన కొబ్బరి మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 331 హెక్టార్లలో కంచిలి, కవిటి మండలాల్లోని పెద్దశ్రీరాంపురం, మకరాంపురం, పెద్దకొజ్జిరియా, చిన్నకొజ్జిరియా, దూగానపుట్టుగ పంచాయతీల్లో ఆర్ అండ్ ఆర్ పథకాన్ని అమలు చేస్తామన్నారు. ఈ గ్రామాల్లో 610 మంది రైతులకు 1,05,92,000 రూపాయలను వారి బ్యాంకు ఖాతాల్లోకి జమచేయడం జరిగిందని ఉద్యానశాఖ అధికారిణి పి.మాధవీలత చెప్పారు. ఈ పథకంలో భాగంగా తెగుళ్లు, వయసు పైడిన, దిగుబడి తగ్గిన మొక్కలు కత్తిరింపులకు, తీసివేసిన మొక్కలస్థానంలో కొత్త మొక్కలు వేసుకోవడానికి, తోటల్లో యాజమాన్య పద్ధతులైన ఎరువులు, వేసవి దుక్కులు, పచ్చిరొట్ట ఎరువులు, క్రిమిసంహారక మందులు, జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు, సేంద్రియ ఎరువులు వేసుకోవడానికి ఉద్యానశాఖ వారు ఆర్ అండ్ ఆర్ పథకం కింద రైతులకు ఈ మొత్తాలను వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, హెచ్‌ఈవో బాల రాజు, ఎండీడీవో లలితకుమారి, విష్ణువర్ధన్ ఉన్నారు.

కాయగూరల సాగుతో అధిక లాభాలు



ఏటీఎం మోడల్‌గా పంట పొలంలో కూరగాయల విత్తనాలు నాటుతున్న సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: హైబ్రీడ్ విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకానికి స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయం ద్వారా పెరటి తోటల్లో, పంట పొలాల్లో కాయగూరల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని యూనిట్ ఇన్‌చార్జ్ మద్దిలి చిట్టిబాబు అన్నారు. పాయితారి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఆధ్వర్యంలో కాయగూరల విత్తనాలను ఎలా నాటాలి, వ్యవసాయం ఎలా సాగు చేయాలి అనే అంశంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. రైతులే కాకుండా భూమిలేని ప్రజలు సైతం తమ ఇళ్ల వద్దనే కొద్దిపాటి స్థలంలో ప్రకృతి వ్యవసాయంలో కూరగాయల సాగును చేసుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా రైతు వలపల తుంబనాథం పంట పొలంలో 'ఏటీఎం' మోడల్‌గా కూరగాయలు నాటే ప్రక్రియను చేపట్టారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్పీలు కె.కుమారీ, ఎం.సంతోషి, దుక్క స్వాతి, పిట్ట నాగమణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- మండల సమావేశంలో ఎంపీపీ శ్రీరామమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీరామమూర్తి

నందిగాం: రాజకీయాలకు అతీతంగా, పక్షపాతం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో టి.రాజారావు ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి శ్రీకాంత్‌వర్మ మాట్లాడుతూ.. కౌలు రైతుల అర్హతలు సభకు వివరిస్తూ కౌలు రైతులు దరఖాస్తు చేసేకునేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యశాఖ సేవలు పొందాలని ఎంపీపీ సూచించారు. అనంతరం ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు ఉద్యానవన పంటలు సాగు చేసుకునే అవకాశం ఉందని.. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈసీ ప్రకాష్ తెలిపారు. అయితే దీనిపై గ్రామసభలు నిర్వహించాలని రాంపురం సర్పంచ్ పినకాన జోగారావు కోరారు. అనంతరం గృహనిర్మాణశాఖ ఏఈ దినేష్ శాఖ నివేదిన సభకు తెలియజేశారు. ఈ సందర్భంగా శివరాంపురం సర్పంచ్ సబ్బి జానకీరాం మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక రూపాయి వేసిన లబ్ధిదారులకు పూర్తి బిల్లులు చెల్లించాలని కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారులకు గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో పథకాలు అందజేశామని.. ఇప్పుడు కూడా అలాగే అందించాలని కోరారు. గ్రామాల్లో కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఇబ్బందులకు గుర్తి చేస్తే అధికారులు సమాధానం చెప్పుకోవల్సివస్తాదని గుర్తు చేశారు. అలాగే గ్రామాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులకు అధికారులు సమాచారం అందించాలని, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులను విస్మరిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ ప్రభుత్వంలో చిన్ని ఉద్యోగులను ఊడగొట్టాలని చూస్తున్నారని, అలాంటి చర్యలు చేపడితే కోర్టులను ఆశ్రయిస్తామన్నారు. అలాగే నాయకులు చెప్పారని అధికారులు బాధ్యతా రహిత్యంగా ప్రవర్తిస్తే కోర్టుల వెంట అధికారులు తిరగవలసి ఉంటుందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు పేరాడ భార్గవి, యర్ర చక్రవర్తి, చిన్ని జోగారావుతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక కష్టాలు..



: స్టాక్ పాయింట్ నుంచి తొలుసూరుపల్లి రోడ్ వరకు భారీగా నిలిచిపోయిన ట్రాక్టర్లు

టెక్కలి: టెక్కలిలోని ఆర్టీసీ డిపో సమీపంలోని స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కోసం ట్రాక్టర్ యజమానులు పడుతున్న కష్టాలు రోజు రోజుకూ ఎక్కువవుతున్నాయి. స్టాక్ పాయింట్ నుంచి తొలుసూరుపల్లి రోడ్‌లో గల వంశధార కాలువ వరకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు నిలిచిపోయాయి. స్టాక్ పాయింట్ వద్ద వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది సంఖ్యను పెంచితే తమకు ఈ కష్టాలు ఉండవని ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు గోడు వెల్లబుచ్చుకుంటున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని వారంటున్నారు. రోజూ ఇసుక కోసం వచ్చి గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితిని తట్టుకోలేకపోతున్నామని వాపోతున్నారు.

కిడ్నీ రోగికి ఆర్థిక సాయం



సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: మండలంలోని బడే కుప్పన్నపేట కేంద్రంగా పని చేస్తున్న కేపీ స్పందన ఫౌండేషన్, వల్లేవలసకు చెందిన మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కిడ్నీ మార్పిడి చేయించుకున్న యువకుడికి అండగా నిలిచారు. ఆమదాలవలసకు చెందిన 22 ఏళ్ల గయ సందీప్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడేవారు. దీంతో తల్లి కిడ్నీ దానం చేయడంతో మూత్రపిండ మార్పిడి శస్త్ర చికిత్స విశాఖలోని ఓ ఆస్పత్రిలో చేశారు. ఈ విషయం తెలుసుకున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. మందుల కొనుగోలు, వైద్య పరీక్షలు, నిర్వహణ ఖర్చులకు స్పందన ఫౌండేషన్ రూ. 15 వేలు, మనబడి అసోసియేషన్ ప్రతినిధులు పది వేల రూపాయలను ఆస్పత్రికి శనివారం వెళ్లి బాధితుడికి అందజేసి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు షణ్ముఖరావు, రెడ్డి సూరిబాబు, శివారెడ్డి, అప్పన్న ఉన్నారు.

మందస 108 అంబులెన్స్ పనితీరు పరిశీలన



వాహనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కాశీబుగ్గ: మందస మండల 108 అంబులెన్స్‌ను అధికారులు శనివారం పరిశీలించారు. డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ గండేపల్లి జగన్ వాహనంతోపాటు రికార్డులు పరిశీలిచారు. ఈఎంటీ జి.శంకర్, పైలెట్ వి.మురళీమోహన్ రావు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి 13 మంది ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు యాగాటి చిన్నంనాయుడు తెలిపారు. నూజివీడు బ్రాంచికి తూముల నాగసాయి పూజిత, అరసవల్లి సుకాంత్, రొలా సుశ్మిత, కర్రి చైతన్య, రాజాం యశ్వంత్ పొట్నూరు వరుణ్, ఒంగోలు బ్రాంచికి కె.సిద్ధార్థ, రాణా మహేశ్వరి, శ్రీకాకుళం క్యాంపస్‌కు కొన్ని పూర్ణిమా, పంగ వినయ్‌కుమార్, రాత్నాల సుసుమ, తంగుడు హాసిన ఎంపికైనట్టు పేర్కొన్నారు. కాగా పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

మృతుని కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



పరామర్శలో అప్పలరాజు తదితరులు

పలాస: పలాస మండలం అమలకుడియా గ్రామానికి చెందిన పోలాకి సరోజనమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శనివారం గ్రామానికి వెళ్లి సరోజనమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుమారుడు ధర్మారావుకు ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

బస్ షెల్టర్ నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాశీబుగ్గ: వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి పంచాయతీలో ప్రయాణికుల విశ్రాంతి భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషను పలాస మండలం శాసనాం గ్రామంలో శనివారం కలిసి వినతిపత్రం అందించారు. బస్ షెల్టర్ లేక ఎండ, వాన సమయంలో ప్రయాణికులు, విద్యార్థులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ విషయంపై ఎంపీ కె.రామ్మోహన్ నాయుడుతో మాట్లాడి ఎంపీ నిధులతో బస్ షెల్టర్ నిర్మిస్తామని అన్నారు. అలాగే అనంతగిరి గ్రామంలో ప్రజలు నిర్మించుకున్న గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలని కూడా గ్రామస్తులు కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అనంతగిరి నాయకులు ఉంగ భుజంగరావు, రంది పోలయ్య, క్రిష్ణరెడ్డి, గండేటి బాలరాజు, జనపాన గణేష్‌రెడ్డి, రంది చిన్నారావు, ఠాగూర్ ఉన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సత్కారం



రుద్రమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: సీనియర్ జర్నలిస్టు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు లండ రుద్రమూర్తికి కాకినాడ అల్లూరి సీతారామరాజు కళాపరిషత్ విశిష్ట ప్రతిభా పురస్కారం అందించి సత్కరించింది. వజ్రపుకొత్తూరు మండలం కంబాలరాయుడుపేట గ్రామానికి చెందిన ఈయనకు కళావేదిక అధ్యక్షులు కర్రి అచ్యుత రామారెడ్డి, సంస్థ ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు, విశిష్ట అతిథి పి.శివప్రసాద్ తదితరులు రుద్రమూర్తిని సత్కరించారు. రుద్రమూర్తికి పురస్కారంపై ప్రవాస ఆంధ్ర ప్రజానాట్య మండలి ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్, కళాకారులు కొండప్ప వెంకటరావు, కవి బి.కె.దేవానా, ప్రిన్సిపాల్ మురుపల్లి బాబూరావు, సీనియర్ జర్నలిస్టు శివజ్యోతి, శివకుమార్, బర్రి జోగారావు, జానపద బ్రహ్మకుమార్‌నాయక్, తెప్పల కృష్ణమూర్తి, ఉద్దానం సాహితి సంస్కృతిక వేదిక హర్షం వ్యక్తం చేసింది.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న గౌరవాధ్యక్షుడు కామేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ, జిల్లాపరిషత్ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న సమగ్రశిక్షా వర్క్, ఆర్ట్, వ్యాయామం విద్య ఉపాధ్యాయులు తమకు ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇల్లీసుపురంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో జిల్లాస్థాయిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షులు గుడివాడ కామేశ్వరరావు, అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి లోపింటి దిలీప్, ఉపాధ్యక్షులు చిగిలిపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. అరకొర వేతనాలతో పని చేస్తున్న తమకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని వేడుకున్నారు. ఉద్యోగ భద్రత కల్పించి జీతాలను పెంచాలన్నారు. సంఘ కోశాధికారి పందిరి తారకేశ్వరరావు పాల్గొన్నారు.

చినుకు పడితే చెరువే!



చెరువును తలపిస్తున్న బస్టాండ్ కూడలి



మురుగునీటిలో పక్కకు ఒరిగిన ఆటో

వజ్రపుకొత్తూరు:

వజ్రపుకొత్తూరు మండలంలోని ప్రధాన వర్తక వ్యాపార కేంద్రం పూండి. అయితే చినుకు పడితే చాలు బస్టాండ్, వైఎస్సార్ కూడళ్లు చెరువులను తలపిస్తాయి. శనివారం కురిసిన కుండపోత వర్షానికి వరద, డ్రైనేజీలు, సెప్టిక్ ట్యాంక్‌ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్డుపైకి వచ్చిచేరింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. తరచూ ఇదే సమస్య ఉంటుందని స్థానికులు వాపోయారు. నీరు నిలిచిపోవడంతో దుర్వాసన వస్తుందని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని స్థానికులు జనార్దనరావు, దున్న రవికుమార్, కేశవ రావు, పాపారావు కోరారు.